# కార్దము కథ

— జ్యోత్స్న

అమ్మగారు, అంటే సావిత్రమ్మగారు, అంటే మా అద్దె ఇంటి ఓనరు రాయబారం కృష్ణయ్యగారి సతీమణి — గుక్క కోసం ఆగి మరో తట్ట వరస ప్రారంభించారు. స్కూలు చదువులు లేకపోయినా ఆవిడకి తెలుగు బాగా వచ్చని నాకెప్పట్నుంచో తెలుసు. ఆవిడ నన్ను రకరకాల యతులు, ప్రాసలూ, యమకాలు, జాతీయాలు, నుడి కారాలూ, అలంకారాలూ, కారాలూ, మిరియాలూ అన్నీ మిళాయించి షడ్రసోపేతంగా తిడుతుంటే తెలుగు భాష ఇంత అందమైనదా అనే మురిపెం నాకు కలగబోతుండగా-

"ఇదుగో అబ్బాయ్, ఇన్నేళ్ళా మా యింట్లో వున్నందుకు నీకు మగుగాలు అబ్బాయ్ అనుకున్నాను— లేదు. నీకు వదవేస్తే ఉన్న మతిపోయింది. ఇంటి కొచ్చిన కొత్త జంటని, అందులోనూ ఈ మధ్యే ఓ ఇంటి వాళ్ళై మనింటికి మట్టపు మాపుగా వచ్చిన చిలకా గోరింకల్ని రాత్రంతా మనింటి వసారాలో పడుకో బెట్టావు... నువ్వు మా ఇంట్లో ఇంకొక్క రోజు వుండడానికి వీల్లేదు. రేపే ఖాళీ చేసెయ్యండి..." అని కీవిగా ఇంట్లోకి వెళ్ళిపోయి తలుపు వేసేసుకుంది.

నా నెత్తి మీద బాంబు పడినట్లైంది. డైరెక్ట్ హిట్. ఈ రోజుల్లో వైజాగ్ లాంటి మహా నగరాలలో అద్దె ఇల్లు హఠాత్తుగా ఖాళీ చేయడం కంటే గొప్ప కష్టం ఏముంది? అమ్మ గారికి కళా కళలు. ఆగ్రహం వస్తే ఆగ్రహమే, అను గ్రహం వస్తే అనుగ్రహమే. మా శ్యామ్ గాడు డాక్టర్లు చెప్పిన మూడు నెలల తర్వాత గాని పుట్టకపోవడం చేత వసంత పుట్టింట్లో ఆర్నెల్లు తిష్టవేసినప్పుడు, ఆ ఆర్నెల్లూ నాకు రోజూ అన్నం పెట్టిన సావిత్రమ్మగారే ఇప్పుడు నేను చిన్న తప్పు చేశావని ఇల్లు ఖాళీ చేసెయ్యమంటు న్నారు.

పరమేశ్వరా! ఎంత కష్టం తెచ్చి పెట్టావయ్యా! ఇది న్యాయమేనా!

నేను చేసింది తప్పు అని అమ్మగారు భావించారు కనుక మాట వరసకి నేనూ తప్పు అంటున్నా గానీ అది రైట్ అని నా దృఢ విశ్వాసం. మొత్తం జరిగిందివినండి. మీరూ నాతో ఏకీభవిస్తారు.

* * *

వసంతచెల్లెలు కాళింది. బంగారు తల్లి. ఆమెకీ మధ్య పెళ్ళైంది. అతను ఒక బహుళ జాతి సంస్థలో ఉద్యోగం చేస్తూ ఓ దేశాన్నుంచి మరో దేశానికి అవలీలగా బదిలీలు పొందుతూ సుఖంగా కాలం గడుపుతుండగా పెద్దలు ఓ రోజున ముక్కుకి తాడేసి కాళిందికి అప్ప జెప్పారు. "నాకెంత గొప్ప మొగుడు దొరికాడో చూడండోచ్" అన్నట్టు కాళింది అతన్ని హనీమూన్ పేరు చెప్పి ఆంధ్రాలో అన్ని ఊళ్ళూ తిప్పుతూ చుట్టాల ఇళ్ళూ కళ్ళకళ్ళాడిస్తూ, తన వస పిట్ట వాగుడుతో అందరి చెవులూ అదర గొడుతూ తిరుగుతోంది. ఎక్కడా ఎవరి తోనూ రెండు మూడు రోజుల కంటే వుండరు వాళ్ళు. అంచేత పెద్ద బర్డేమీ కాదు వాళ్ళు రావడం. పైగా కాళింది మొగుడు నరహరి ఎవరింటికీ వట్టి చేతుల్తో వెళ్ళకూడదనే శాస్త్ర నియమం ఏదో వున్నట్టు విదేశాల్నించి తెచ్చిన ఏవో వింత వస్తువులూ బహుమతులూ చుట్టా లకి ఇస్తూనే వుంటాడు. అతనికి డబ్బు లెక్కలేదు.

నాకు కాళింది అంటే, వసంతతో నా పెళ్ళైన నాటి నుంచీ వున్న వాత్సల్యం వల్ల కాబోలు ఆ అల్లరి పిల్ల ఇప్పుడు గొప్పగా ఓ మొగుణ్ణే కట్టుకుని ఇల్లా లైందంటే ఓ వింత అనుభూతి కలిగి వాళ్ళిద్దరూ మా ఇంట్లో వుంటే మాడా



# దీపావళి- దివ్య తేజోవళి



చిత్రం: వెల్లటూరి పూర్ణానంద శర్మ, వెల్లటూరు.

లన్న ఆరాటం? అంచేత వాళ్ళెప్పుడు మా ఇంటికి వస్తారా అని తహతహ మొదలైనాయి. ఎన్నెమ్మార్ కాలేజీలో ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్‌గా నాకు సమాజంలో ఓ తగుపాటి స్థానం, ఆదాయపుపన్నువారి చిట్టాల్లో నాకో పేజీ. మా అద్దె వాటా మాత్రం ఒకటిన్నర గదులే — ముందు వరండాలో మా భాగం రెండు మంచాలకి సరిపోతుంది కానీ ఎవరం పడుకోం. ఘోరమైన ఉక్కా, దోమలూ, వరండాలో నడిచే కుక్కలూ, జనమూను.

రాయబారం వారింటిని రాయబారం వారి సత్రం అని కూడా కొందరు చమత్కరిస్తారు. ఆ ఇంట్లో తొమ్మిది అద్దె వాటాలు. అంచేత వరండా వున్నా లేనట్టే లెక్క. కాగా మాకో వీధి గది కమ్ ఆఫీసు గది కం గెస్ట్ రూం కం పిల్లల చదువుల గది! నాట్ నాట్, దాని వెనకాల మా బెడ్ రూం. వెనక వరండాని రేకుల, తడకల సాయంతో కిచెన్ గానూ, బాత్‌రూంగానూ మార్చారు.

అంచేత వరహారీ కాళిందీ దంపతుల విడిది కోసం నేను ముందే అప్లికేషన్ పడేసి ఇంటివాళ్ళు వుంటున్న మేడ మీద ఓ గది తాత్కాలికంగా మాకు అద్దె కిచ్చే ఏర్పాటుచేయించాను. ఆ గదిలో ఫోం బెడ్స్‌తో డబుల్ కాట్, డ్రెస్సింగ్ టేబుల్, ఎటాచ్డ్ బాతురూం, అంతకు మించి మన దేశంలోనే కాదు ప్రపంచంలోనే అతి కొద్ది మందికి లభించే విశాఖ సముద్రం కనిపించే కిటికీ... ఓహ్! అదొక గ్రేట్ లగ్జరీ.

* * *

ఇంత శ్రద్ధా తీసుకుని, ఇంత అభిమానంతోనూ వరహారి కాళిందిల కోసం ఆ మేడ మీద గది సిద్ధం చేసి, తీరా వాళ్ళు వచ్చేసరికి వాళ్ళకి ఆ గది ఇవ్వకుండా మా అసలు అద్దె వాటాలోకి కూడా రానీయకుండా ఆ వాటా ముందున్న వరండాలో అదీ సావిత్రమ్మ గారు దయతో ఇచ్చిన నల్లుల మంచం మీద వరహారీ, కుళ్ళు చాప మీద కాళిందీ పడుకుని రాత్రంతా మన్మధుడ్ని కాల్చేసిన శివుణ్ణే తల్చుకుంటూ, శివరాత్రేమో ఆ వచ్చినవి ప్రమథ గణాలేమో ననిపించే దోమలకు దాసోహం అంటూ, కాల భైరవుల్లా వచ్చి "ఈ వరండాలో రోజూ మేం పడుకునే వాళ్ళం. మా చోట్లో మీరెందుకు పడుకున్నారు" అన్నట్టు మొరిగే ఊరకుక్కలకు సమాధానాలు చెప్పకుంటూ గడిపే దుస్థితి అసలు ఎలా వచ్చిందిట? అదే స్వయం కృతాపరాధం అంటే!

వరహారీ, కాళిందీ మా ఇంటికి ఏ రోజు వస్తున్నదీ రాయకపోవడం వల్లనే వాళ్ళకింత కష్టం వచ్చింది.

ఒక్క కార్డు ముక్క రాసి వుంటే వాళ్ళకి ఈ బాధ తప్పేది. అంతే కాదు వాళ్ళ కోసం మేడ మీద మేం సిద్ధం చేసిన హనీమూన్ గదీ దక్కేది.. అందరికీ హాయిగా వుండాల్సిన వాళ్ళ రాక ఉత్తరం పత్తరం లేకుండా రావడంతో ఈ విధంగా విషాదభరితమయింది.

"ఈ ఉత్తర కుమారుడెవ్వరా! ఉత్తరం ముక్కకి ప్రాముఖ్యం ఇస్తున్నాడు" అని మీలో కొందరు కార్యశూరులు అనుకుంటూ వుండచ్చు. మీకు మాటల కంటే చేతలు ముఖ్యం? చుట్టాలకి ఉత్తరాలు రాయడం కంటే డైరెక్ట్‌గా వాళ్ళింట్లో దిగిపోవడం ముఖ్యం అనిపించవచ్చు.

తొందర పడకండి.

పూర్వపు రోజులలో సినీ పాటలు లేక, రేడియోలూ టీవీలూలేక, హాబీలూ ఉద్యోగాలూ లేక, వార్తా పత్రికలూ నవలలూ లేక "మనింటికి ఏ చుట్టం వస్తాడా...కాస్త ఆ కబురూ ఈ కబురూ చెప్పి మనకి కాలక్షేపం కలిగిస్తాడా" అని మొహం వాచిపోయి వుండేవారు మధ్య తరగతి మనుషులు — అందరూ కాదేమో.. కొందరు! — కనీసం సగం మంది.

ఇప్పుడో! పల్లెటూళ్ళలో కూడా ఇంటింటికీ, పాకపాకకీ రేడియో- ఆ మాట కొస్తే టీ.వీ — నిత్య మిత్రులుగా తిష్టవేసి రోజంతా వార్తలూ, కథలూ, పాటలూ, పద్యాలూ, సలహాలూ చక్కిలిగింతలూ అందిస్తున్న ఈ రోజులలో-


ఇంటి కొచ్చిన ఇంటి యజమానికి ఇల్లాలు మంచి నీళ్ళు ఇవ్వడం కూడా కష్టమైన రోజులలో- చెప్పాపెట్టకుండా వచ్చే చుట్టాలకి రాచమర్యాదలు ఎవరు చేస్తారు! ఎందుకు చేస్తారు?

**"Every guest hates the other and host them all"** అనే లోక దృష్టిని ఎంత అందంగా చెప్పాడు షేక్ స్పియర్ మహాకవి! 'అతిథి దేవోభవ' అంటుంది వేదం. అతిథి అంటే వేళా పాళా లేకుండా మనింటి మీద వాలే వాడు అని అర్థం. అలా వచ్చిన వాడికి పాద పూజ చేసి అన్నం పెట్టాలని ఆదేశిస్తుంది వేదం-అంచేత ఉత్తరం ముక్క రాయకుండా వచ్చిన వరహారి కాళింది దంపతులకు దేవుడే దిగి వచ్చినట్టు సత్కరించాలని అర్థం వస్తుంది కదూ!

అదే మిడిమిడి జ్ఞానంవల్ల వచ్చే అర్థం! అంటే అపార్థం!!

'బంధువులూ, స్నేహితులూ అతిథులు కారు' అని కూడా శాస్త్రాలే చెప్పాయి.

వరహారి ఐదారేళ్ళుగా విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. రోజుకి కొన్ని వందల సార్లు టెలిఫోన్ వాడే అలవాటుంది అతనికి. రైళ్ళూ, ప్లేన్లూ...



అన్నింట్లోనూ ముందే చోటు రిజర్వ్ చేసుకోవాలని అతనికి మనకంటే బాగా తెలుసు. అందుకే మద్రాసులో మా పెద్ద తోడల్లుడి ఇంట్లో గడిపి, ఇప్పుడు వైజాగ్‌లోని మా ఇంటికి రావడానికి అతను మెయిల్‌లో ఫస్ట్ క్లాస్ ఏ.సి. పెట్లో పదిహేను రోజుల క్రితం రిజర్వ్ చేయించుకున్నాడు.

అయినా ఫలానా రోజున ఫలానా ట్రైన్‌కి మేం వస్తున్నాం అని ఓ కార్డ్ ముక్క రాయాలని తోచలేదు వరహారికీ-కాళిందికీ కూడా.

'బావ కాశీ వెళ్ళాడు-వచ్చాడు' అని సామెత. కొందరు చదువుల్లో, ఉద్యోగాల్లో, ఇల్లు కట్టడాల్లో, కార్లు మార్చడంలో, బట్టలు వేసుకోడంలో ఎన్నింట్లో ఆధునికులైనా కొన్నింట్లో తాతలూ, మామ్మల పద్ధతుల్ని వదులుకోలేరు కాబోలు.

మా తాతగారికి- ఆయన నా పదిహేడో ఏట పోయారు-ఏడాదికి మూడు ఉత్తరాలు వస్తే గొప్ప. ఆయనా అన్నే ఉత్తరాలు రాసేవారు. దానికి పెద్ద హంగామా.

కాళిందికి నా ఉత్తరాల పిచ్చి తెలుసు. నాకు మా చుట్టాల్లో ఉత్తర ఫల్గుణి అనే బిరుదు వుంది. నేను ముందు తెలియపర్చకుండా ఎప్పుడూ ఎవరింటికీ వెళ్ళను. అది ఈ రోజుల్లో వుండాల్సిన ప్రథమ మర్యాద అని నా నమ్మకం. వీలైతే ఫోన్ చేస్తాను. లేకపోతే ఉత్తరం రాస్తాను. కాకపోతే ఎవరింటికో వెళుతూ వాళ్ళింటి ముందు ఆగినట్టు నటించి తర్వాత వస్తానని చెప్పి వాళ్ళింటికి వెళ్తాను.

ఎలాగో అలా చుట్టాలందరికీ నా ఈ అభిప్రాయం తెలియజేస్తాను. "మీరందరూ రండి. మా యింటికి చుట్టాలే అలంకారం. కానీ పది రోజుల ముందు ఉత్తరం రాసి మరీ రండి. అలా కాకుండా వస్తారా- మేం సరిగా మీకు మర్యాద చేయలేక పోవచ్చు!" అని గ్రీటింగ్స్ ప్రింట్ చేయించి చుట్టాలకీ, బంధువులకీ, స్నేహితులకీ అందరికీ పంపాను మొన్న సంక్రాంతికి.

ఈ నా ఉత్తరాల పిచ్చి కాళిందికి బాగా తెలుసు.

అయినా పదిహేను రోజుల క్రితం మా ఊరికి మెయిల్లో రిజర్వేషన్ చేసుకున్నప్పుడు ఆ చేత్తో ఓ కార్డు రాస్తే ఆమె చేతులు నొప్పుతాయా?

ఎందుకలా చేస్తారో మనుషులు?

* * *

వసంత ప్రైవేటుగా బియే పరీక్షలు రాస్తోంది. అంచేత ఊళ్ళోనే వున్న బుద్ధా అన్నయ్య మా పిల్లల్ని తీసికెళ్ళి తనింట్లో పెట్టుకున్నాడు.

వరహారి కాళింది కోసం మేం తాత్కాలికంగా మా ఇంటివాళ్ళ మేడ మీద ఓ గది తీసుకున్నాం కదా! ఆ గదిలో వసంత చదువుకోడం, నేను సముద్రాన్ని చూస్తూ కిటికీలో కూర్చుని మధ్య మధ్య ఆమె చదువు చెడగొడుతూండడం- అదొక మరపురాని అనుభవం.

ఇక రేపు ఒక్క పరీక్ష వుందనగా బుద్ధా వచ్చాడు. అతను బియ్యే చాలా వరకూ పాసయ్యాడు కాని ఆ సబ్జక్టు మాత్రం "మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే" డిటెక్టివ్ నవల్లా అతన్ని వదలడం లేదు.

అంచేత అతను వచ్చి "వసంతా! మనిద్దరం కంబైండ్ స్టడీస్ చేద్దామే. లేకపోతే నేను ఈ జన్మలో ఆ సబ్జెక్ట్ పాసవను" అని ఏడిచాడు. వసంతని తన ఇంటికి తీసుకుపోయాడు. ఆమె ఆటోలో కూచున్నాక నన్ను చాటుకి పిలిచి "కాళిందీ, వరహారీ ఈ రోజు మెయిల్లో వస్తున్నారు మీ ఇంటికి. ఈ సంగతి వసంతకి తెలిస్తే పరీక్షకి చదవడం మానేస్తుంది సంతోషం పట్టలేక. నువ్వే వాళ్ళకి మర్యాద చెయ్యి. రేపు పరీక్ష కాగానే వసంతని ఇక్కడకు తీసుకొచ్చేస్తాను" అని పరుగెత్తి ఆటో ఎక్కేశాడు.

బుద్ధాకి కూడా కొంచెం బుర్ర వుందని గ్రహించి ఎంతో ఆనందించాను. ఎందుకంటే అతను వసంత సైకాలజీ బాగా స్టడీ చేశాడు. వసంతకి బంధువులంటే పిచ్చి ప్రేమ. కాళింది అంటే మరీను. అంచేత ఇప్పుడు అనుకోకుండా వచ్చిన కాళిందిని చూస్తే ఒళ్ళు మరిచిపోతుంది. అదే ముందుగానే ఆమె వస్తున్నట్టు తెలిసి వుంటే ఈపాటికి ఉద్రేకం తగ్గి ప్రశాంతంగా ఆమె రాకకు సిద్ధమయ్యేది.

అదే నాకు బాధ కలిగించింది. వసంత ఇప్పుడు బియ్యే పరీక్షకి ప్రైవేటుగా వెళ్తోందని కాళిందికి తెల్సు. ఇప్పుడు పరీక్షల సీజన్ అనీ తెలుసు. ఒక్క రోజు లేటుగా-అంటే రేపు వచ్చేలా వాళ్ళు మెయిల్లో రిజర్వ్ చేసుకుంటే హాయిగా వుండేది.

పోనీ ఈ రోజే వస్తున్నారు!అలా అని ఉత్తరం రాసినా బాగుండేది! ఎందుకంటే ముందుగానే తెలిసిన విషయం షాక్ యివ్వదు. అంచేత వసంత పరీక్ష ప్రిపరేషన్ ముందే చేసేసుకునో, లేదా కాళింది పక్కనే వున్నా పెద్దగా డిస్టర్బ్ కాకపోవటాన మామూలుగా చదివేసుకునో పరీక్షకు వెళ్ళి వుండేది.

ఒక్క కార్డు ముక్క ఎంత అద్భుతం చేసేది?

నాకు కోపం వచ్చింది!

చాలా కోపం వచ్చింది!!

మనుషులకి క్రమశిక్షణ లేకపోతే ప్రేమ ద్వారా కూడా ఇతరుల్ని బాధించగలరు.

కాళింది ఇప్పుడదే చేస్తోంది.

నేను పగపట్టాను. వాళ్ళకు బుద్ధి చెప్పాలి. వసంత అలా వెళ్ళగానే నేనూ సైకిలేసుకుని ఊళ్ళోకి చెక్కేశాను. మా తాళం ఎప్పుడు నేను బయటకు వెళ్ళినా అమ్మగారికి ఇచ్చేవాణ్ణి ఇవ్వకుండా చెక్కేశాను.

హాయిగా మంచి పాత సినిమా మూవ్‌షో చూసి, హోటల్లో భోంచేసి, తర్వాత ఫ్రెండ్స్ ఇళ్ళకెళ్ళి బాతాఖానీ కొట్టి రాత్రి పదింటికి పిల్లిలా ఇంటికి చేరాను.

పవర్ కట్ కనుక ఎవరికీ కనబడకుండా మేడ మీది గెస్ట్ రూంలో చేరి కిటికీలోంచి చూస్తూనే-క్రింద మా వాటా ముందు వరండాలో ఎవరో మొగవాడు, మగువ వున్న సూచన కనిపించింది.

కాళిందీ-వరహారీని!

వాళ్ళ మాటల్ని బట్టి వాళ్ళు మెయిల్ దిగ్గానే మా ఇంటికి రాలేదనీ, నేరుగా టాక్సీలో భీమ్లీ వెళ్ళి అక్కడి బీచ్ చూసి, మెల్లిగా సాయంత్రం ఏడింటికి మా ఇంటికి చేరారనీ, ఆ చీకట్లో, ఎవరూ వాళ్ళని పట్టించుకోలేదనీ తెలిసింది. అంటే వాళ్ళు ఈ రోజు మెయిల్‌కి మధ్యాహ్నం వస్తున్నట్టు తెలిసి వుంటే, సాయంత్రం దాకా వాళ్ళ కోసం ఎదురు చూసి ఎదురుచూసి వసంతకి పిచ్చెత్తేది. పరీక్ష సంతకెళ్ళేది.

పట్టరాని కోపంతో నా పళ్ళు పటపట లాడాయి. మేడమీద కిటికీలోంచి వరండాలో కుక్కి మంచం మీద ఒకరూ, కుళ్ళ చాప మీద ఒకరూ పడుకుని వున్న ఆ దంపతుల్ని కళ్ళారా చూసి ఆనందించి వాళ్ళ దోమ బాధనీ, శునక సందడినీ, ఉక్కనీ, వరండాలో పడుకున్నామన్న అవమానాన్నీ పూర్తిగా అనుభవించనిచ్చి తెల్లవారాక "అమ్మగారూ, కాఫీ ఇవ్వరూ వసంత లేదు కదా" అంటూ సావిత్రమ్మగారి వంటింట్లోకి వెళ్ళేసరికి!

అక్కడ కాఫీ తాగుతూ కాళిందీ, వరహారీ కనిపించేసరికి నోరు జారాను.

"ఊఁపదిహేను రోజుల క్రితం ఈ ఊరికి టికెట్ కొనుక్కున్నారు. అనుకోకుండా వేసిన ట్రిప్ కాదు. అయినా ఓ కార్డు ముక్క రాయలేకపోయారన్న మాట. రాత్రి బాగా నిద్రపట్టిందా... నేను మేడమీద నుంచి చూస్తూనే వున్నాన్లెండి హ...హ" అన్నాను.

అదే నా కొంప ముంచింది.

మనం చేసింది మంచిపని అయినా గొప్ప చెప్పుకో కూడదన్నారు. ఎందుకో ఇప్పుడు తెలిసింది.

నేను అలా గొప్ప చెప్పుకోగానే అంత వరకూ నాకు వాళ్ళొచ్చినట్టు తెలీక అలా చేశానని అనుకుంటున్న సావిత్రమ్మగారు తారాజువ్వలా లేచి నన్ను నెడా మడా తిట్టి ఇల్లు ఖాళీ చేసెయ్యమన్నారు.

* * *

మరో గంటో రోజో గడిచాక కాళింది చేత చెప్పించి అమ్మగారి మనసు మార్పించాలి. కాళింది బంగారుతల్లి! *

